క్లుప్తంగా

డ్రోన్ల ద్వారా భూసర్వే



మున్సిపల్ కార్యాలయంలో డ్రోన్ల ద్వారా సర్వే ప్రారంభిస్తున్న కమిషనర్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీలో జగనన్న భూహక్కు, భూరక్షా పథకం కింద భూముల రీసర్వే డ్రోన్ల ద్వారా చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బిల్లి నాగేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం డ్రోన్ల సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సంబంధిత సాంకేతిక సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, డ్రోన్ సర్వేను కమిషనర్‌కు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూముల రీసర్వే దశాబ్దాల అనంతరం జరుగుతుందని పలు భూ సమస్యలు పరిష్కరింపబడతాయని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ఖాసీం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో తాగునీటి వసతి సౌకర్యం



ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారుల సౌకర్యార్థం రూ.4.50 లక్షల మండల పరిషత్ నిధులతో తాగునీటి వసతికి బుధవారం చర్యలు చేపట్టారు. ఇటీవల లేఅవుట్‌లోని లబ్ధిదారులు తమకు తాగునీటి వసతి కల్పించాలని మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంపీపీ మూలె పద్మజ దృష్టికి తీసుకెళ్లి రూ.4.50 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో బోరు వేసి పైప్‌లైన్ వేసి నీటి వసతి కల్పించనున్నారు.

పంచముఖ శక్తిగణపతికి సంకటహర పూజలు



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో కొలువైన శ్రీపంచముఖ శక్తి గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. రేవూరు నారాయణరెడ్డి, పద్మావతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లు అర్చనలు పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

సంగమేశ్వరస్వామి హుండీ లెక్కింపు



సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో అధికారులు బుధవారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఎనిమిది నెలల పాటు భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను సిబ్బంది లెక్కించారు. హుండీలో భక్తులు రూ.2.13 లక్షల నగదును కానుకగా సమర్పించినట్లు ఈఓ పెంచలవరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతల దినోత్సవం



కావలి: 'తరుచుగా రక్తం, ప్లాస్మాదానం చేయడం ద్వారా జీవితాన్ని పంచండి' అనేది ఈ సంవత్సరం ప్రపంచ రక్తదాతల దినం నినాదమని రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెడవాడ రవికుమార్ తెలిపారు. బుధవారం సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కావలిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో రక్తం ఆవశ్యకత పెరిగిందని, ఆస్పత్రిలో చికిత్స పొందే పది మందిలో ఒక్కరికి రక్తం అవసరమవుతోందన్నారు. అందువల్ల రక్తదాతల సంఖ్య పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, అధ్యక్షుడు ఎన్ ప్రణీత్, జిల్లా వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, యోగా కేంద్రం కన్వీనర్ హరి నారపరెడ్డి, టీం సేవియర్స్ ప్రణీత్, రమణ, రాజేష్, కీర్తి, కీర్తన, సుతేష్, ప్రేక్ష, హుషల్, నవ్య, కౌసిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి సామాజిక బాధ్యత

- డాక్టర్ సుబ్బారావు సేవలు నిరుపమానం
- కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి జాతీయ స్థాయి ఉత్తమ వైద్య సేవల అవార్డు
- ఈ ఘనత ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బరావుదే
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



డాక్టర్ సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైద్య వృత్తి సామాజిక బాధ్యతగా పేద వర్గాలకు వైద్య సేవలు అందించాలని, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ వైద్యుడిగా కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు పేద ప్రజలకు నిరుపమాన వైద్య సేవలు అందించారని ఆ స్ఫూర్తిని రగిలించారన్నారు. ఈ ఆస్పత్రి కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేశారని డాక్టర్ సుబ్బారావు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నేపథ్యంలో కావలిలో ఒక కల్యాణ మండపంలో బుధవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య విద్య చదవడానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుందని, కానీ వైద్య చదువు ముగియగానే కార్పొరేట్ హాస్పిటల్స్‌లో, వీలైతే విదేశాలకు వెళ్లి వైద్యులుగా స్థిరపడుతున్న పరిస్థితిని గమనిస్తున్నామన్నారు. ప్రజల డబ్బుతో వైద్య విద్యను చదివి, ప్రజలకు ముఖ్యంగా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యులుగా చేరడానికి మాత్రం ఆసక్తి చూపడం లేన్నారు. అయితే డాక్టర్ కామంచి సుబ్బారావు పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో, పేద కుటుంబంలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసు కాబట్టే , వైద్య విద్యను పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా చేరి తన పదవీ కాలమంతా పేదలకు వైద్య సేవలు అందించేందుకు తహతహలాడరని అభినందించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న వారు డాక్టర్ సుబ్బారావును ఆదర్శంగా తీసుకుని, వైద్య వృత్తి సామాజిక బాధ్యతగా, స్ఫూర్తిగా అనుసరించాలని ఎమ్మెల్యే కోరారు. లక్షలాది మందికి ప్రభుత్వ వైద్యుడిగా వైద్య సేవలు అందించిన డాక్టర్ కామంచి సుబ్బారావు కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా వైద్యుల బృందానికి, నర్సింగ్ స్టాఫ్‌కు మార్గనిర్దేశం చేస్తూ పేదలకు సకాలంలో వైద్య సేవలు అందిందేకు అహరహం కృషి చేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వైద్యుడిగానే కాకుండా, వైద్యుల బృందానికి సారథిగా కూడా డాక్టర్ కామంచి సుబ్బరావు విజయవంతమైన కార్యదక్షత కనపరిచారని ఎమ్మెల్యే అన్నారు. కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జాతీయ స్థాయిలో ఉత్తమ వైద్య సేవలు అందించే వైద్యశాలగా అవార్డులు, ప్రోత్సాహక నగదు బహుమతులు సాధించేలా చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనంతరం డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ కావలి పరిసర ప్రాంతాల ప్రజల ప్రోత్సాహం, ఆశీస్సులు, మంచితనం, ఎమ్మెల్యేలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు తదితరుల సహకారంతో తాను ప్రభుత్వ వైద్యుడిగా ఇంత కాలం ప్రజలకు వైద్య సేవలు అందించానని వినమ్రతతో చెప్పారు. అనతంతరం కావలి పట్టణంలోని వైద్యులు, వ్యాపారులు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ సుబ్బారావు దంపతులను ఘనంగా సన్మానించారు.

సచివాలయాల్లో నిర్దిష్ట వ్యవధిలో సేవలు

- జేసీ కూర్మనాథ్



మండలంలోని అనంతసాగరం-2 సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ కూర్మనాథ్

చేజర్ల (సోమశిల): సచివాలయాల్లో లబ్ధిదారులకు నిర్దిష్ట వ్యవధిలో సేవలు అందాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సిబ్బందికి సూచించారు. అనంతసాగరం మండలంలోని అనంతసాగరం-1, అనంతసాగరం-2 సచివాలయాలను బుధవారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాల వివరాలు ముద్రించిన పోస్టర్లను పరిశీలించారు. సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న లేఅవుట్లకు సంబంధించి ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఎంత వరకు ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయనే వివరాలు తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో పంటల సాగు, ఉద్యాన పంటల గురించి అడిగారు. అంబేడ్కర్ స్మృతి భవనానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతసాగరంలో మినీ స్టేడియం, క్రీడా ప్రాంగణంకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు.

బొమ్మవరంలో..

మండలంలోని బొమ్మవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి స్థలాన్ని జేసీ కూర్మనాథ్ పరిశీలించారు. బొమ్మవరం బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద సుమారు 1.50 సెంట్ల స్థలంలో ఈ ఆస్పత్రిని రూ.2.44 కోట్లతో నిర్మించనున్నారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మాట్లాడండి

- 'ఆనం' రాజకీయ విమర్శలకు వైఎస్సార్‌సీపీ నేతల కౌంటర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన బీ ఫారంతో గెలిచి ఎమ్మెల్యే పదవిని అనుభవిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని, మీరు ముందుగా పదవికి రాజీనామా చేసి అప్పుడు మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. బుధవారం సంగం వెలుగు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎంతో సుభిక్ష పాలన అందిస్తున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి పాలన జగనన్న అందిస్తున్నారని, పేద ప్రజలను ఆదుకునేందుకు అన్ని రకాలుగా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క వైఎస్సార్ కుటుంబానికే దక్కుతుందన్నారు. విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి అన్ని వసతులు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి పేదలను ఆదుకుంటే ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి పేదలందరికీ వైద్యం అందేలా చేస్తున్నారన్నారు. రెండేళ్లు కరోనా కాలంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆరోగ్యశ్రీ అమలు చేసి పేద ప్రజలను ఆదుకున్నారని, లేకుంటే ఎంతో మంది కరోనాకు బలైపోయేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను నాలుగేళ్ల పాటు తీవ్రంగా విమర్శించిన ప్రతిపక్ష పార్టీలు ప్రస్తుతం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పేర్లు మార్చి మేనిఫెస్టోలో ప్రకటించుకున్నారన్నారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆనం ప్రసాద్‌రెడ్డి, మానికల చందన్ కుమార్, నేతలు ఫణికుమార్‌రెడ్డి, పట్టాభి, శంకరయ్య, శ్రీనివాసులరెడ్డి, జనార్దన్‌రెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడం అభినందనీయం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి



అవార్డును పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వైద్యుడు వినీత్‌కు అందజేస్తున్న దృశ్యం

కావలి: కావలికి చెందిన వైఎస్సార్ సంచార పశు వైద్యులు ఆవుల వినీత్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం అభినందనీయం అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యేను ఆయన నివాసంలో వినీత్ కలిసి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కిన వైనాన్ని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక మంచి ఆశయంతో పశు పోషకులకు నేరుగా వారి వద్దకే పశు వైద్యం అందే విధంగా ఈ సంచార పశు వైద్య సేవలు ప్రవేశ పెట్టారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం కాగా, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి సంచార వైద్య సేవలు ప్రవేశ పెట్టడం పశుపోషకులకు వరంగా మారిందన్నారు. ఈ వైద్య సేవలు ప్రవేశ పెట్టినప్పటి నుంచి జిల్లా స్థాయిలో పలుమార్లు ప్రథమ స్థానం దక్కగా, ఏడాదిలో చేసిన సేవలకు డాక్టర్ వినీత్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం శుభ పరిణామం అని కొనియాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన వినీత్ లాంటి వారికి అవార్డులు దక్కుతాయని ప్రశంసించారు. ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకొని కావలికి ఇంకా మరిన్ని అవార్డులు దక్కాలని ఆకాంక్షించారు.

నేత్రపర్వం.. సీతారాముల గ్రామోత్సవం



గరుడ వాహనంపై స్వామి గ్రామోత్సవం

కొండాపురం: మండలంలోని కొమ్మిలో కొలువైన సీతారాముల మందిరంలో జరుగుతున్న నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యకంగా అలంకరించి పూజలు చేసి గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. వడ్డెర కులస్తులు ఉభయకర్తలు వ్యవహరించారు. బుధవారం రాత్రి యాదవ కులస్తులు ఉభయకర్తలుగా నిర్వహించే సీతారాముల ఉత్సవం నేపథ్యంలో సీతాలమ్మ, రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తలకు అన్నదానం చేవారు.

వైఎస్సార్‌సీపీలో 26 కుటుంబాలు చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీ కట్టుబడిపాళెంలో టీడీపీకి చెందిన 26 కుటుంబాలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలోని టీడీపీకి చెందిన ఐత శీనయ్య, రిబకమ్మ , సుబ్బారావు, ఎస్తేరమ్మ, సుధాకర్, అన్నపూర్ణ, సుబ్బమ్మ, నాగేంద్రమ్మ, శీనయ్య, శాంతమ్మ, నవీనమ్మ, సుప్రజ, వెంకయ్య, సలోమి, యమీల, నరేష, దావీదు, కుమారియమ్మ, కొండమ్మ, చెంచయ్య, కోటేశ్వరమ్మ, ఏసుబాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, చెన్నూరు సర్పంచ్ సునీత, రాష్ట్ర పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి, బోడగుడిపాడు ఎంపీటీసీ మహేష్, మాజీ ఎంపీపీ వేముల ఆదిశేషయ్య వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పునరావాస పరిహారం

- ఆర్డీఓ కరుణకుమారి



పడమటినాయుడుపల్లి నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణంలో ఆస్తులు, భూములు కోల్పోతున్న అర్హులైన నిర్వాసితులు అందరికీ ప్రభుత్వ తరఫున పరిహారం, పునరావాసం అందజేస్తామని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి చెప్పారు. మండలంలోని పడమటినాయుడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పడమటినాయుడుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెటిల్‌మెంట్ పట్టాలు కాకుండా, అగ్రిమెంట్లు, డీకేటీలు, పొచీలు, అనువంశికాలు, తదితర అంశాలకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు లేని భూములకు సంబంధించిన యజమానులకు పరిహారం తప్పక అందజేస్తామన్నారు. తహసీల్దారు ఆనంద్‌రావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వివిధ అంశాలకు సంబంధించి 92 వినతులు అందాయని సమగ్రంగా పరిశీలించి అర్హులందరికీ ప్రభుత్వం తరఫున మేలు జరిగేందుకు సిఫారస్సు చేస్తామన్నారు. ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓలు హరి, రమణ పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం

ఉదయగిరి: దుత్తలూరు–సీతారామపురం మార్గంలో నూతనంగా నిర్మించనున్న 165- బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, నివాసాలు, వృక్షాలు కోల్పోయే యజమానులకు నష్టపరిహారం అందిస్తామని ఆత్మకూరు ఆర్డీఓ ఎస్ కరుణకుమారి తెలిపారు. మండలంలోని రైతులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆత్మకూరు ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఆమె రైతుల వద్ద నుంచి భూములకు సంబంధించిన ధ్రువపత్రాలు తీసుకుని రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే పరిహారం చెల్లింపుపై కొంత మంది రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, భూసేకరణ డీటీ మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, సర్వేయర్లు రవి, మీరావలి, వీఆర్వో వెంకట్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

పట్టణంలోని బిట్-1, బిట్-3 సచివాలయాలను ఆర్డీఓ కరుణకుమారి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిట్-3 సచివాలయంలో సిబ్బంది యూనిఫాం లేకపోవడం గమనించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు సచివాలయ సిబ్బందా బయట వ్యక్తులా అని వారిని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.

అశ్వవాహనంపై కోటేశ్వరుడు



అశ్వవాహనంపై కోటేశ్వరుడు

సంగం: మండలంలోని దువ్వూరులో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి అలకలతోపు కార్యక్రమంలో భాగంగా అశ్వవాహనంపై కోటేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. కోటేశ్వరస్వామిని అశ్వంపై ఉంచి పలురకాల పరిమళ పుష్పాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

పాఠశాలలకు జగనన్న విద్యాకానుకలు

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం ప్రత్యేక వాహనంలో జగనన్న విద్యాకానుక కిట్‌లను ఎంఈఓ మస్తాన్‌వలి పంపించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో 3,753 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వారికి జగనన్న విద్యాకానుక కిట్‌లు అందిస్తున్నామన్నారు. వారికి పాఠశాలలు పునఃప్రారంభమైన రోజున విద్యార్థులందరికీ పాఠశాలల హెచ్‌ఎంలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలపై నేడు సమీక్ష

దుత్తలూరు: ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న వెంగమాంబ బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఏర్పాట్లపై కావలి ఆర్డీఓ శీనానాయక్ అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నర్రవాడ దేవస్థాన కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం జరుగుతుందని ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షకు అన్నిశాఖల అధికారులు తమ ప్రణాళికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

పరిపాలన అధికారిగా వెంకటేశ్వరరావు

అల్లూరు: అల్లూరు మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారిగా పి వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన సీతారామపురం మండలం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పరిపాలన అధికారిగా పని చేసిన షేక్ మస్తాన్ బదిలీ నిమిత్తం అనంతసాగరానికి వెళ్లారు.

సోమశిలలో గుర్తుతెలియని మృతదేహం

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని మృతదేహం లభించిందని సోమశిల ఎస్సై భోజ్యా నాయక్ తెలిపారు. స్థానిక జాలర్లు ఇచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి జలాశయంలోకి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశామన్నారు. మృతదేహం స్థితిని బట్టి మృతి చెంది సుమారు కొన్ని రోజులు అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మృతుడు తెల్లటి బనియన్, నల్లటి నిక్కరు ధరించి ఉన్నాడు. వయస్సు 40 ఏళ్ల పైన ఉండొచ్చని అంచనా. వీఆర్వో ప్రభాకర్ సమక్షంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు.

ఉచిత నృత్య కళా నిలయం ప్రారంభం



ఉచిత నృత్య కళా నిలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్‌లో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత నృత్య కళా నిలయాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర కుమార్తె లిఖిత సంయుక్త నృత్య కళా నిలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. లిఖితకు తన ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు. త్వరలోనే సంయుక్త నృత్య కళా నిలయానికి అవసరమైన స్థలాన్ని సమకూర్చుతానని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ బెజవాడ రవికుమార్, మాజీ కౌన్సిలర్లు గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, పేరం వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరువీధి.ప్రసాద్, స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా, ఉపాధ్యాయురాలు జి కళ్యాణి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, విశ్రాంత హెచ్‌ఎం. అజిత్‌బాబు, మీ కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీఫ్ కుమార్, లెక్చరర్ పీవీ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సంగం: మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఏ లక్ష్మీప్రసన్న బుధవార, ఒక ప్రకటనలో తెలిపారు. 8న అన్నారెడ్డిపాళెం, మక్తాపురం, 9న పడమటిపాళెం, 13న సిద్ధీపురం, 14న దువ్వూరు, 15న జెండాదిబ్బ, 16న వంగల్లు, జంగాలకండ్రిక, కలిగిరి కొండూరు, 17న మర్రిపాడు, 20న తరుణవాయి, చెన్నవరప్పాడు, 21న కోరిమెర్ల, కోరిమెర్ల కండ్రిక, సీలాయపాళెం, తలుపూరుపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరురూరల్: మండలంలో గురువారం నుంచి ఈ నెల 21 వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దారు లక్ష్మీనరసింహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న బొటికర్లపాడు, పడకండ్ల, యర్రబల్లి, వెన్నవాడ, 9న గండ్లవేడు, నారంపేట, 12న నబ్బీనగరం, పమిడిపాడు, 13న కనుపూరుపల్లి, బండారుపల్లి, ముురగళ్ల, 14న నువ్వూరుపాడు, అశ్వనీపురం, జంగలపల్లి, 15న నాగులపాడు, నెల్లూరుపాళెం, 16న వాశిలి, బోయలచిరివెళ్ల, 17న గొల్లపల్లి, దేపూరులో జరుగుతాయన్నారు. 19న ఆరవేడు, జంగాలపల్లి, కరటంపాడు, సాతానుపల్లి, 20న బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, అప్పారావుపాళెం, కొత్తపాళెం, కొట్టాలు, మహిమలూరు, బసవరాజుపాళెం, కోటపాడు, రామస్వామిపల్లి, బంట్లపల్లి, 21న ఆత్మకూరు, వెంకట్రావుపల్లి, నరసాపురం, శాంతినగర్, జాలయ్యనగర్, ముస్తాపురం, అల్లీపురం, పేరారెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించి ఆయా సచివాలయాల్లో జరుగుతాయని ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో పంటకు పుష్కలంగా సాగునీరు

- ఇరిగేషన్ ఈఈ ఆర్. వెంకటేశ్వర్లు



ఆత్మకూరు: సోమశిల జలాశయం నుంచి రెండో కారుకు సాగునీరు విడుదల అయిందని, ఆత్మకూరు తూర్పు పాలా లకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించేందుకు పంపింగ్ స్కీమ్ మరమ్మతులు పూర్తి చేసినట్లు, దీంతో సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉంటాయని ఆత్మకూరు డివిజన్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆర్ వెంకటేశ్వర్లు అన్నారు. కొద్ది రోజులుగా మండలంలోని కనుపూరుపల్లి వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీమ్ మరమ్మతులు పూర్తి చేసినట్లు బుధవారం నీటిని విడుదల చేసినట్లు, పైపుల ద్వారా సాగిన నీరు ఆత్మకూరు పట్టణంలోని బట్టేపాడు మార్గంలో పంట కాలువలో విడుదలైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో విలేకరులతో వివరాలు తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో మరమ్మతులకు గురైన పంపింగ్ స్కీమ్‌లో పేరుకుపోయిన ఇసుకను 15 రోజులుగా తొలగించి మరమ్మతులు చేశామన్నారు. దీంతో సాగునీరు ఇబ్బంది లేకుండా వస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో పంట కాలువ, పెద్దిరెడ్డి కాలువ తదితర కాలువల పూడిక తీత పనులు యంత్ర సహాయంతో వారం రోజులుగా చేయించినట్లు ఈఈ వివరించారు. రైతులు నీటిని వృథా చేసుకోకుండా సహకరించుకుంటూ రెండో కారు పండించుకోవాలని ఆయన సూచించారు. నీరు విడుదల కావడంతో రైతులు ఎమ్మెల్యే, ఈఈలకు కృతజ్ఞతలు తెలిపారు.